ధాన్యం రవాణా వాహనాలకు జిపిఎస్

శ్రీకాకుళం సిటీ: ఈ ఖరీఫ్ సీజన్‌కు సంబంధించిన ధాన్యాన్ని రైతు సేవా కేంద్రాల నుంచి మిల్లులకు తరలించేందుకు కొత్త వాహనాల నమోదు ప్రక్రియ ప్రారంభమైందని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ ఒక ప్రకటనలో తెలిపారు. ధాన్యం రవాణా చేసే ప్రతి వాహనానికి కచ్చితంగా జిపిఎస్ పరికరం అమర్చుకోవాలని స్పష్టం చేశారు. ఆసక్తి గల వాహనదారులు ముందుగా రూ.3,068 చెల్లించి జిపిఎస్ అమర్చుకోవాలని, ఆ తర్వాతే రైతు సేవా కేంద్రాల వద్ద తమ వాహన వివరాలను నమోదు చేసుకోవాలని సూచించారు. జిపిఎస్ లేకుండా రిజిస్ట్రేషన్ సాధ్యం కాదని తేల్చి చెప్పారు. రైతు సేవా కేంద్రాల్లో నమోదు చేసుకున్న వాహనాలకు మాత్రమే రవాణా ఖర్చులను ప్రభుత్వ నిబంధనల మేరకు చెల్లిస్తుందని తెలిపారు. రవాణా కాంట్రాక్టు ఆశించే వాహనదారులు ఆలస్యం చేయకుండా వెంటనే జిపిఎస్ అమర్చుకుని, రైతు సేవా కేంద్రాల్లో వాహన వివరాలను వివరాలను నమోదు చేసుకోవాలని సూచించారు.

ఖరీఫ్‌లో ధాన్యం సేకరణ

6.50 లక్షల మెట్రిక్ టన్నులు

- తూకంలో తప్పిదాలు జరిగితే ఉపేక్షించం
- వారం రోజుల్లో కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు ఆదేశం
- కొనుగోలుపై 16న రాష్ట్రస్థాయి కాన్ఫరెన్స్
- పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్

మాట్లాడుతున్న పౌర సరఫరాల శాఖ మంత్రి మనోహర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

జిల్లాలో ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో 6.50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయనున్నామని రాష్ట్ర పౌర సరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. ధాన్యం సేకరణపై కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఉత్తరాంధ్రలోని ఆరు జిల్లాల అధికారులతో సోమవారం సమీక్షించారు. శ్రీకాకుళంతో సహా ఆరు జిల్లాల పరిధిలో మొత్తం 13.84 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయనున్నామని తెలిపారు. పంట ముందుగానే వస్తుందనే అంచనాల మేరకు కొనుగోలు కేంద్రాలను వారం రోజుల్లో తెరిచేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియ పారదర్శకంగా జరగాలని, గతంలో చోటుచేసుకున్న తప్పిదాలు పునరావృతమైతే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ధాన్యం కొనుగోలులో రైతులకు నష్టం కలగకుండా చూడాలని, తూకంలో ఎటువంటి తప్పిదాలు చోటుచేసుకోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. మిల్లర్లు తప్పులు చేస్తే కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రైస్‌మిల్లర్ల నుంచి ఈ ఏడాది ఈ-బ్యాంకు గ్యారంటీ రూపంలో 1:2 నిష్పత్తిలో బ్యాంకు గ్యారంటీలను తీసుకుంటామని తెలిపారు. అకాల వర్షాలతో రైతు తక్కువ ధరకే అమ్మాల్సిన పరిస్థితి లేకుండా కనీస మద్దతు ధర ఇస్తామన్నారు. రైతుల వద్ద నుంచి ధాన్యం కొనుగోలు చేసిన 24 గంటల నుంచి 48 గంటల్లోనే ప్రభుత్వం రైతుల ఖాతాల్లో నగదు జమ చేస్తుందని వెల్లడించారు. ధాన్యం కొనుగోలుపై సిబ్బందికి శిక్షణ ఇవ్వాలని, ఎప్పటికప్పుడు టెలీకాన్ఫరెన్స్‌లు ఏర్పాటు చేయాలన్నారు. గోనె సంచులు, రవాణాపై దృష్టిసారించి జిపిఎస్ తప్పకుండా ఉండాలని సూచించారు. ఈనెల 16న రాష్ట్రస్థాయి కాన్ఫరెన్స్ నిర్వహించనున్నామని తెలిపారు.

పౌర సరఫరాల శాఖ కమిషనర్ సౌరభ్‌గౌర్ మాట్లాడుతూ రైతు సేవా కేంద్రాల్లో తప్పిదాలు జరగకుండా చూడాలని సూచించారు. ధాన్యం తరలించేందుకు ఒక్కో జిల్లాకు ఐదు వేల వాహనాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. రైతు సేవా కేంద్రాల వారీగా టార్పాలిన్లు సరఫరా చేయనున్నట్లు చెప్పారు. అవసరాన్ని అంచనా వేసుకుని గోనెసంచులు సిద్ధంగా ఉంచుకోవాలని ఆదేశించారు. డేటా ఎంట్రీ ఆపరేటర్లపై అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. పౌర సరఫరాల సంస్థ వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ మాట్లాడుతూ గతేడాది చేసిన ధాన్యం సేకరణలో సమస్యలు పునరావృతం కారాదని, జిపిఎస్ పరికరాలు ఏర్పాటు చేసిన వాహనాల ద్వారా మాత్రమే తరలించాలని స్పష్టం చేశారు.

కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మాట్లాడుతూ గతేడాది జిల్లాలో అకాల తుపాన్లు సంభవించినట్లు చెప్పారు. ఆ సమయంలో కొంతమేర రైతులు పంట నష్టపోయారని తెలిపారు. టార్పాలిన్లు పంపిణీ చేసినట్లు చెప్పారు. జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ మాట్లాడుతూ డేటా ఎంట్రీ ఆపరేటర్లు, టెక్నికల్, తదితర సిబ్బందికి జీతభత్యాల కోసం మంత్రి దృష్టికి తీసుకురాగా, ఆయన సానుకూలంగా స్పందించారు. సమావేశంలో గత సీజన్ అనుభవాలు, ప్రస్తుత ఖరీఫ్ సీజన్ ధాన్యం సేకరణకు చేసిన ఏర్పాట్లు, ధాన్యం సేకరణపై సిబ్బందికి శిక్షణ వంటి అంశాలపై తమ అనుభవాలను జాయింట్ కలెక్టర్లు వివరించారు.

మిల్లర్లు, రైతుసంఘాలు పలు సమస్యలు ప్రస్తావన

ధాన్యం కొనుగోలు సమస్యలపై రైతుసంఘాలు, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ నాయకులు పౌర సరఫరాలశాఖ మంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. ధాన్యం కొనుగోలు సందర్భంగా రైతులు ఏవిధంగా దోపిడీకి గురవుతున్నారో ఎపి రైతుసంఘం విజయనగరం జిల్లా కార్యదర్శి బి.రాంబాబు వివరించారు. రెవెన్యూ రికార్డుల్లో భూ విస్తీర్ణంలో ఉన్న తేడాల వల్ల రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేయకపోవడంతో, తక్కువ ధరకే రైతులకు అమ్ముకుంటున్నారని రైతుసంఘం శ్రీకాకుళం జిల్లా కార్యదర్శి కె.మోహనరావు వివరించారు. అనంతరం వారు పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందించారు. జిల్లాలో ఈ సారి వరి పంట బాగా వచ్చిందని, జిల్లాకు 6.50 లక్షల మెట్రిక్ టన్నుల లక్ష్యం సరిపోదని రైస్ మిల్లర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు బోయిన రమేష్ అభిప్రాయపడ్డారు. సమావేశంలో పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ, రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ డైరెక్టర్ ఆర్.గోవిందరావు, జాయింట్ కలెక్టర్లు, పూజిత, ఎం.జాహ్నవి, కె.మయూర్ అశోక్, ఎస్.సేథు మాధవన్, సి.యశ్వంత్ కుమార్ రెడ్డి, అసిస్టెంట్ కలెక్టర్ పృథ్వీరాజ్ కుమార్, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ప్రతినిధులు ఎస్.మురళీకృష్ణ, తంగుడు నాగేశ్వరరావు, రైతు, కౌలు రైతు సంఘాల ప్రతినిధులు వెలమల రమణ, బి.వాసుదేవరావు, గిరివికాసం, ఆదివాసీ రైతు ప్రగతి ఎఫ్‌పిఒలు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర కార్యదర్శి సురేంద్ర

థర్మల్ ప్లాంట్‌ను రద్దు చేయాలి

- గిరిజనుల జీవనం, పర్యావరణాన్ని దెబ్బతీయొద్దు
- ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర కార్యదర్శి కిల్లో సురేంద్ర

ప్రజాశక్తి - శ్రీకాకుళం

బూర్జ, సరుబుజ్జిలి మండలాల పరిధిలో వెన్నెలవలస వద్ద రూ.30 వేల కోట్ల అంచనా వ్యయంతో 3,200 మెగావాట్ల సామర్థ్యం గల థర్మల్ విద్యుత్కేంద్ర నిర్మాణ ప్రతిపాదనను రద్దు చేయాలని ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర కార్యదర్శి కిల్లో సురేంద్ర రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నగరంలోని సిఐటియు జిల్లా కార్యాలయంలో సోమవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. థర్మల్ విద్యుత్కేంద్ర ఏర్పాటైతే బూర్జ, సరుబుజ్జిలి మండలాల్లోని 20 గిరిజన గ్రామాల్లో సుమారు ఐదు వేల మంది గిరిజనుల జీవనాన్ని తీవ్రంగా దెబ్బతీస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. వంశధార గొట్టాబ్యారేజీ పరిధిలో ఆధారపడిన వేలాది మంది రైతులకు సాగునీరందక పంట పొలాలు బీడు భూములుగా మారుతుందన్నారు. పవర్ ప్లాంట్ చుట్టుపక్కల పర్యావరణం, గిరిజనుల జీవనం, వారి సంస్కృతిపై తీవ్ర ప్రభావం చూపుతుందన్నారు. జెన్‌కో ఆధ్వర్యాన ఏర్పాటు చేయ తలపెట్టిన పవర్ ప్లాంట్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. గిరిజన ప్రాంతాలు అభివృద్ధి చెందాలంటే నాన్ షెడ్యూల్ గిరిజన గ్రామాలను షెడ్యూల్ ఏరియాలో కలపాలని, జిల్లాలో ఐటిడిఎ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి నిమ్మక అప్పన్న, జిల్లా కమిటీ సభ్యులు ఎస్,జైరాం, నాయకులు ఎస్.ప్రసాద్, ఎస్.సంకయ్య పాల్గొన్నారు.

'మీకోసం'కు 92 వినతులు

వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

భూ సమస్యలు పరిష్కరించి న్యాయం చేయాలని ఆమదాలవలస మండలం దూసికి చెందిన దళితులు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌ను కోరారు. జిల్లాపరిషత్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. 17 దళిత కుటుంబాలకు చెందిన సర్వే నంబర్ 61-2లో మూడు ఎకరాల స్థలం ఆక్రమణకు గురైందన్నారు. 2001లో అప్పటి ప్రభుత్వం 11 సెంట్లు చొప్పున పట్టాలు అందజేసిందని, అవి ఆక్రమణకు గురయ్యాయన్నారు. వైద్యారోగ్యశాఖలో 22 ఏళ్లుగా సేవలందిస్తున్న 920 మందిని రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వం అక్రమంగా తొలగించిందని, వారిని విధుల్లోకి తీసుకోవాలని ఎపి హెల్త్ అసిస్టెంట్ ఎంప్లాయిస్ యూనియన్ అసోసియేషన్ నాయకులు కోరారు. లావేరు మండలం చిన్నయ్యపేటకు చెందిన కలిశెట్టి తమ్మయ్య తన సమీప బంధువులు ఇబ్బందులు పెడుతున్నారని, చట్ట పరంగా తనను ఆదుకోవాలని కోరారు. శ్రీకాకుళం రూరల్ మండలం బద్రాలపేటకు చెందిన వృద్ధుడు ఎం.రాము తనకు ఇళ్ల పట్టా, ఇళ్లు మంజూరు చేయాలని కోరారు. సరుబుజ్జిలి మండలం మర్రిపాడుకు చెందిన మంగమ్మ తనకు రేషన్‌కార్డు లేకపోవడం వల్ల ఇబ్బంది పడుతున్నానని, రేషన్ కార్డు మంజూరు చేయాలని కోరారు. గారకు చెందిన సరస్వతి పట్టాదారు పాస్ పుస్తకం మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. 'మీకోసం'కు వ్యక్తిగత, సామాజిక సమస్యలపై 92 వినతులు వచ్చాయి. ఇందులో రెవెన్యూకు సంబంధించి 40, మున్సిపల్ కార్పొరేషన్ 11, పంచాయతీరాజ్ 9, సొసైటీ ఫర్ ఎలిమినేషన్ ఆఫ్ రూరల్ పవర్టీ 4, ఇపిడిసిఎల్ 4, పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ 6, హౌసింగ్ 2, పౌర సరఫరాల శాఖ 2, సర్వే అండ్ లాండ్ రికార్డ్స్ 2, నైపుణ్యాభివృద్ధి 2, మైన్స్ అండ్ జియాలజీ, వక్ఫ్ బోర్డు, ఆర్‌టిసి తదితర శాఖలు ఒక్కొక్కటి చొప్పున వినతులు స్వీకరించారు. అర్జీల స్వీకరణలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, అసిస్టెంట్ కలెక్టర్ పృథ్వీరాజ్ కుమార్, జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వరరావు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ పద్మావతి తదితరులున్నారు.

కల్తీ మద్యంపై సిబిఐతో దర్యాప్తు చేయాలి

ఇచ్ఛాపురం : వినతిపత్రం అందజేస్తున్న సీతారాం

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

రాష్ట్రంలో ఇటీవల బట్టబయలైన నకిలీ మద్యం దందాపై సిబిఐ దర్యాప్తు చేయాలని మాజీ స్పీకర్, వైసిపి పార్లమెంటరీ అధ్యక్షులు తమ్మినేని సీతారాం డిమాండ్ చేశారు. నకిలీ మద్యం దందా, బెల్టు షాపులపై వైసిపి నాయకులు ఎక్సైజ్ కార్యాలయం వద్ద సోమవారం ఆందోళన చేపట్టారు. ముందుగా స్థానిక మున్సిపల్ కార్యాలయం నుంచి మెయిన్ రోడ్డు మీదగా నినాదాలు చేస్తూ... ర్యాలీగా వచ్చారు. ఎక్సైజ్ సిఐ పి.దుర్గాప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీతారాం, జెడ్‌పి చైర్‌పర్సన్ పిరియా విజయ, పరిశీలకులు దుంపల లక్ష్మణరావు మాట్లాడారు. రసాయనాలతో తయారు చేసిన నకిలీ మద్యం పాపులర్ బ్రాండ్లు తలపించే బాటిల్స్‌పై నకిలీ లేబులతో సరఫరా చేయడం దారుణమన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేసిన నాటి నుంచి దాదాపు 421 మంది నకిలీ, కల్తీ మద్యం వల్ల మృతి మృతి చెందారని అన్నారు. కూటమి ప్రభుత్వం వైన్ షాపులు పెంచడమే కాకుండా ప్రైవేట్ వారికి అప్పగించి, పర్మిట్ రూమ్‌లను అనుమతిం చారని అన్నారు. రాష్ట్రంలో పెరిగిన వైన్ షాపులు, బెల్ట్ షాపులు పర్మిట్ రూమ్‌లు వల్ల మహిళలకు రక్షణ కొరవడిందన్నారు. శాంతి భద్రతలపై ప్రభావం చూపిస్తుందని అన్నారు. ప్రణాళిక, వ్యూహం ప్రకారం ప్రభుత్వ పెద్దలు కనుసన్నలు మద్యం దందా సాగుతుందని ఆరోపించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పిరియా సాయిరాజ్, మున్సిపల్ చైర్‌పర్సన్ రాజ్యలక్ష్మి, వైసిపి రాష్ట్ర కార్యదర్శి నర్తు నరేంద్ర యాదవ్, ఎంపిపి బోర పుష్ప, వైస్ చైర్‌పర్సన్లు భారతీ దివ్య, లాభాల స్వర్ణమణి, వైసిపి నాయకులు నర్తు శివాజీ, దేవదాస్, తడక జోగారావు, ఇప్పిలి కృష్ణారావు పాల్గొన్నారు.

పలాస : పలాసలో కల్తీ మద్యంపై నిరసిస్తూ వైసిపి ఆధ్వర్యాన ఆందోళన చేపట్టారు. మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు నేతృత్వంలో వైసిపి నాయకులు కాశీబుగ్గ శ్రీనివాస లాడ్జి కూడలిలో నిరసన తెలిపి మానవహారం చేపట్టారు. అనంతరం ఎక్సైజ్ సూపరింటెండెంట్ రామచంద్ర కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సిదిరి శ్రీదేవి, మహిళా నాయకులు సుజాతపండ, పాలిన శ్రావణి, బోర చంద్రకళ, సేనాపతి దివ్య, బల్ల ఉషారాణి, జల్లు ఉషారాణి, హేమావతి, లలిత పాల్గొన్నారు.

టెక్కలి రూరల్ : టిడిపి నాయకులు నకిలీ మద్యం కుంభకోణంపై సిబిఐతో దర్యాప్తు చేపట్టాలని వైసిపి సమన్వయకర్త పేరాడ తిలక్ డిమాండ్ చేశారు. సోమవారం వైసిపి నియోజకవర్గ మహిళా విభాగల కార్యవర్గ సభ్యులతో కలిసి భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఎక్సైజ్ సిఐ షేక్ మీరా సాహెబ్ వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ మహిళా అధ్యక్షులు గొండు చాందిని, జెడ్‌పిటిసి దువ్వాడ వాణి తదితరులు పాల్గొన్నారు.

నరసన్నపేట : కల్తీ మద్యంపై దర్యాప్తు చేపట్టాలని పోలాకి జెడ్‌పిటిసి ధర్మాన కృష్ణచైతన్య డిమాండ్ చేశారు. పట్టణంలోని తిరుమల వీధిలో ఉన్న ఎక్సైజ్ కార్యాలయం వద్ద వైసిపి నాయకులు నిరసన తెలిపారు. అనంతరం ఎక్సైజ్ అధికారులకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నియోజకవర్గంలోని ఎంపిపిలు, జెడ్‌పిటిసిలు పాల్గొన్నారు.

రణస్థలం: నకిలీ మద్యంపై ప్రభుత్వానికి వ్యతిరేకంగా మండల కేంద్రంలో మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో రామతీర్థం జంక్షన్ నుంచి ఎక్సైజ్‌స్టేషన్ వరకు భారీ ర్యాలీ నిర్వహించి ఎక్సైజ్ సిఐ ఎల్.అనూరాధకు వినతిపత్రం అందజేశారు. ముందుగా ర్యాలీకి అనుమతులు లేవని స్థానిక ఎస్ఐ ఎస్.చిరంజీవి ఆధ్వర్యంలో పోలీసులు అడ్డుకున్నారు. అయినా ఆగకుండా పోలీసులను తోసుకుని వెళ్లి కల్తీ మద్యం, కల్తీ రాజ్యం అంటూ నినాదాలతో హోరెత్తించి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో నాలుగు మండలాల ఎంపిపిలు, జెడ్‌పిటిసిలు, వైసిపి మండల అధ్యక్షులు, అన్ని అనుబంధ విభాగాల అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

శ్రీకాకుళం సిటీ: రాష్ట్రంలో కల్తీ మద్యంపై సిబిఐ దర్యాప్తు చేయాలని వైసిపి నాయకులు ధర్మాన రామ్ మనోహర్ నాయుడు డిమాండ్ చేశారు. నకిలీ మద్యానికి వ్యతిరేకంగా నిరసన ర్యాలీ నిర్వహించి, అనంతరం ఎక్సైజ్ సిఐ గోపాలకృష్ణకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో గేదెల పురుషోత్తం, ఎన్ని ధనుంజయ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆమదాలవలస: కల్తీ మద్యంపై ప్రభుత్వ పాత్ర ఉందన్న అనుమానాలు కలుగుతున్నాయని వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త చింతాడ రవికుమార్ ఆరోపించారు. పట్టణంలోని వైసిపి కార్యాలయం నుంచి మెట్టక్కివలసలో నున్న ఎక్సైజ్ కార్యాలయం వరకు బైక్‌ర్యాలీ నిర్వహించారు. ఎక్సైజ్ సిఐ జి.సతీష్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో వైసిపి రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బొడ్డేపల్లి రమేష్ కుమార్, వైసిపి నాయకులు ఖండాపు గోవిందరావు, దుంపల శ్యామలరావు, అత్తులూరి రవికాంత్, గోపాలకృష్ణ, సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పలాస : మాట్లాడుతున్న అప్పలరాజు

బాల్య వివాహాలను అరికట్టాలి

జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె.హరిబాబు

అవగాహన కల్పిస్తున్న హరిబాబు

ప్రజాశక్తి - శ్రీకాకుళం లీగల్

బాల్య వివాహాలను ధైర్యంగా నిరాకరించాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.హరిబాబు విద్యార్థులకు పిలుపునిచ్చారు. స్థానిక వికాస్ హైస్కూల్‌లో సోమవారం నిర్వహించిన న్యాయ అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. బాల్య వివాహాలను అరికట్టాల్సిన అవసరముందన్నారు. బాల్య వివాహాల చట్టం, వాటిని అరికట్టాల్సిన ప్రాముఖ్యత గురించి వివరించారు. బాల్య వివాహాల వల్ల కలిగే సమస్యల గురించి వివరించారు. 7, 8, 9 తరగతుల విద్యార్థులకు 'బాలలు స్నేహపూర్వక న్యాయ సేవలు' గురించి అవగాహన కల్పించారు. ప్రతి విద్యార్థి రాజ్యాంగం ఇచ్చిన హక్కులు, బాధ్యతలు తెలుసుకుని మంచి పౌరులుగా ఎదగాలన్నారు. గుడ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన కలిగి ఉండాల న్నారు. కార్యక్రమంలో న్యాయవాది జి.ఇందిరా ప్రసాద్, డైరెక్టర్ కె.వేణుగోపాలరావు, వైస్ డైరెక్టర్ కె.మురళీకృష్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సూపర్ సేవింగ్స్ ఉత్సవాలు ప్రారంభం

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

జిఎస్‌టి 2.0 విజయోత్సవాలను పురస్కరించుకుని నగరంలో ఏర్పాటు చేసిన సూపర్ సేవింగ్స్ వారోత్సవాలను ఎన్‌టిఆర్ మున్సిపాల్ పాఠశాల మైదానంలో ఏర్పాటు చేశారు. దీనిని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, ఎమ్మెల్యే గొండు శంకర్‌లు సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సాధారణంగా పండగల సమయంలో నిర్వహించే ప్రదర్శనలకంటే భిన్నంగా, ఈ సూపర్ జిఎస్‌టి ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశామన్నారు. ప్రజలకు తగ్గింపుల వల్ల కలిగిన నిజమైన ప్రయోజనాలను కళ్లకు కట్టేలా ప్రదర్శించడం ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యంగా చెప్పారు. ఎగ్జిబిషన్‌లో ఏర్పాటు చేసిన ప్రతి స్టాల్‌లో తప్పనిసరిగా ప్రీ-జిఎస్‌టి ధర, పోస్ట్-జిఎస్‌టి ధర తద్వారా వినియోగదారులకు కలిగిన సేవింగ్స్ శాతాన్ని చూపే ప్రత్యేక పట్టికలను ప్రదర్శించినట్లు చెప్పారు.

ఎగ్జిబిషన్‌లో...

ఆటోమొబైల్స్ (రవాణాశాఖ), ఎలక్ట్రానిక్స్, మొబైల్ ఫోన్లు, కిచెన్ వస్తువులు (కమర్షియల్ టాక్స్ విభాగం), కంప్యూటర్, ఎసి, టివి అమ్మకాల స్టాల్స్, జిల్లా ప్రత్యేకతను చాటుతూ 'ఒక జిల్లా ఒక ఉత్పత్తి' పథకం కింద పొందూరు చేనేత చీరలు, ఇత్తడి హస్తకళా వస్తువులు, ఎపిసిఒ, లేపాక్షి ఉత్పత్తులు, సోలార్ పరికరాలు (ఎనర్జీ శాఖ), వ్యవసాయ, ఉద్యాన శాఖల ఉత్పత్తులు, క్రీడా సామగ్రి స్టాళ్లు, ఫుడ్ కోర్టులు ఏర్పాటు చేశారు. వారం రోజులు పాటు ఈ ప్రదర్శన కొనసాగించారు.

ఎగ్జిబిషన్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎమ్మెల్యే గొండు శంకర్

పట్టుకొనుటకు వారెంట్ ఎందుకు జారీ చేయకూడదో ఆ కరణమును చూపుటకు నోటీసు (సివిలు ప్రొసీజరు కోడ్ 21 వ అర్డర్ 37 వ విధి) మహారాజశ్రీ 2 వ అదనపు జూనియర్ సివిల్ జడ్జ్ (స్పెషల్ మొబైలు) కోర్టు శ్రీకాకుళం వారు

E.P.94/2023 in O.S.439/2021

Between:
మీసాల వరప్రసాదరావు. ....డిక్రీ హెూల్డర్
And:-
చింతపల్లి క్రిష్ణ. .....జె.డి.ఆర్

వాది అనువారు నిన్ను పట్టుకొని చెరసాలయందుచుటచే పై వ్యాజ్యములోని డిక్రీని అమలు నెరవేర్చుటకుగాను ఈ కోర్టుకు దరఖాస్తు చేసికొనేను. గనుక సదరు డిక్రిని అమలు నెరవేర్చుటలో నిన్ను సివిల్ చెరసాలకు ఎందుకు పంపకూడదో అ కారణము చూపుటకు.
2025 వ సంవత్సరం 10 వ నెల 31 వ తారీఖున ఈ కోర్టు ఎదుట నీవు హాజరు కావలెనని ఇందు మూలము గా కోరడమైనది

చిగురుపల్లి రామ మోహన్
న్యాయవాది, శ్రీకాకుళం,
సెల్ : 9440116221, 8341023288.

IN THE HONOURABLE COURT OF THE ADDL SENIOR CIVIL JUDGE COURT SRIKAKULAM. O.S: 64/2024

Between:
Gembali Manil Kumar. ....Plaintiff
And:
Simhadri Nageswararao. .....Defendant

To,
Defendant:
Simhadri Nageswararao,
S/o Atchutharao, aged 52 years, business, r/o Door No.12-6-36/A, Gynedi Street, Opp. Gayatri Residency, Srikakulam town and district, Phone No. 9177772333.

పై నెంబరు గల దావాలో మీరు ప్రతివాది అయి ఉన్నారు. సదరు దావాలో మీకు నోటీసు అమలు కొరకు **తే 22-10-2025ది** వాయిదా అయి ఉన్నది. కావున ఆ రోజున మీరుగాని, లేదా మీ తరపున న్యాయవాది గారి ద్వారా గాని **ఉదయం గం॥ 10-30ని॥**లకు పైన తెలిపిన కోర్టువారి ఎదుట హాజరు కావలెను. లేని ఎడల మీ పరోక్షమున తీర్మానించబడును.
(శ్రీ కోర్టువారి ఉత్తర్వుల ప్రకారం)

పి. నాగేశ్వరరావు
న్యాయవాది,
శ్రీకాకుళం, సెల్: 7989478601

IN THE HONOURABLE COURT OF THE PRINCIPAL CIVIL JUDGE (SENIOR DIVISION) AT SRIKAKULAM S.O.P 5/2025

Between:-
1. Dusi Jagadeesh Kumar, S/o.Late Krishnamurthy, aged about 34 years, permanent resident of Door No.9-186, Chinnakorada village, Hiramandalam mandal, Srikakulam district, Aadhaar No.671710392907, mobile no. 8179234273, email id: jagadeeshkumardusi@gmail.com.
2. Dusi @Simhambhatla Prathyusha, W/o Simhabhatla Satish kumar, D/o.Late Krishna murthy, aged about 36 years, permanent resident of Door No.9-186, Chinnakorada village, Hiramandalam mandal, Srikakulam district, Aadhaar No.257690480942, mobile no: 7016533494, email.id: pratyusatish 1989@gmail.com ......Petitioners
And:- NIL .....Respondent

జనరల్ నోటీసు
పై నెంబరు గల పిటిషన్ లో పిటిషనర్స్ సక్షషన్ సర్టిఫికెట్ కొరకు, పై కోర్టులో పిటిషన్ దాఖలు చేసినందున సదరు పిటీషన్‌లో ఎవరికైన ఎట్టి అభ్యంతరములున్నచో **తే॥ 30-10-2025 ఉ 10:30 ని॥ లకు** పైన తెలిపిన కోర్టు యందు మీరు స్వయంగా గాని, వకీలు ద్వారా గాని హాజరై తెలియజేయవలెను. లేనియెడల మీ పరోక్షమందు తీర్మానించబడును.

డి.టి. మణి చందన్
బీఎ.ఎల్.ఎల్.బి., ఎల్. ఎల్.ఎమ్
అడ్వకేట్, ఫరీదుపేట గ్రామం,
ఎచ్చెర్ల మండలం, శ్రీకాకుళం జిల్లా
సెల్ : 8919146438.

బహిరంగ ప్రకటన మహారాజశ్రీ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు నరసన్నపేట నందు

EA.32/2025 EP.14/2024 0S.3/2023

Between:-
పాలకొల్లు భూపతి ....పిటషనర్/డిక్రీ హోల్డర్/వాది
And:-
పాలకొల్లు ఆదిలక్ష్మి
....రెస్పాండెంట్/జెడ్జిమెంట్ డెబిటర్/ప్రతివాది

ఇందుమూలంగా తెలియజేయునది ఏమనగా పైనెంబర్ కేసులు పిటషనర్ మీపైన ఆనగా పాలకొల్లు ఆదిలక్ష్మి, W/o రాజారావు వయస్సు 46 సం॥లు, గృహిణి, లుకులాం గ్రామం, నరసన్నపేట మండలం, శ్రీకాకుళం జిల్లా వారి పై నెంబర్ గల అమలు పిటీషన్ వేస్తూ పై నెంబర్ EA.32/2025 ద్వారా పిటీషన్ షెడ్యూలును సవరణ చేయమనికోరగా శ్రీ కోర్టు వారి ఆదేశాల మేరకు సదరు EA.32/2025 నందు సమన్లు మీకు పంపించినప్పటికి మీరు గ్రామంలో ఉండి కూడా ఉద్దేశపూర్వకంగా నోటీసులు తీసుకోనందున, శ్రీకోర్టు వారు సదరు విషయమై బహిరంగ ప్రకటన ద్వారా మీకు తెలియజేయమని ఆదేశించి పై నెంబర్ గల కేసు నందు మీ యొక్క వ్యక్తి గత హాజరు నిమిత్తం **తే 29-10-2025 దికు వాయిదా వేసియున్నారు.** కావు ఇందుమూలంగా పాలకొల్లు ఆదిలక్ష్మి W/o రాజారావు అను మీకు తెలియజేయునది ఏమనగా **తే 29-10-2025 దిన ఉ॥ 10.30 ని॥లకు** మీరు స్వయంగా గాని, మీ యొక్క వకీలు ద్వారా గాని మహారాజశ్రీ నరసన్నపేట జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు నందు హాజరు కావాలని ఈ ప్రకటన ద్వారా తెలియజేయడమైనది. అందుకు తప్పిన యెడల శ్రీకోర్టు వారు మీ పరోక్షముణ తగు ఆదేశాలు జారీ చేయుదురు.
// శ్రీ కోర్టు వారి ఆదేశాలు మేరకు //

గాలాల వెంకటరమణ
పిటిషనర్/వాది తరుపు న్యాయవాది,
నరసన్నపేట,సెల్ : 9441621433.

ప్రజాశక్తి
www.prajasakti.com

జిఎస్‌టి తగ్గింపుతో అన్ని వర్గాలకు ఊరట

శ్రీకాకుళం సిటీ : బైక్ ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే శంకర్

ప్రజాశక్తి - ఆమదాలవలస

కేంద్ర ప్రభుత్వం సంస్కరణలో భాగంగా అమలు చేస్తున్న జిఎస్‌టి 2.0లో పన్నుల తగ్గింపుతో పేద, మధ్యతరగతి ప్రజలకు ఊరట లభించిందని ఎమ్మెల్యే కూన రవికుమార్ తెలిపారు. సోమవారం పట్టణంలోని ఓ ప్రైవేట్ కళ్యాణ మండపంలో జరిగిన సూపర్ జిఎస్‌టి - సూపర్ సేవింగ్స్ కార్యక్రమంలో ఆయన పాల్గొని తగ్గిన పన్నుల భారాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో దేశంలో పన్నుల విధానం సక్రమంగా లేక ఒకే వస్తువుపై రెండు, మూడుసార్లు పన్నులు చెల్లించాల్సి వచ్చేదని, నేడు ఒక్కసారే పన్ను చెల్లించే విధానాన్ని అమలు చేయడం దేశ ఆర్థిక వ్యవస్థకు ఎంతో మేలు కలిగించిందన్నారు. ఈ పన్ను తగ్గింపును వ్యాపారాలు సక్రమంగా అమలు చేయాలని, ప్రజలకు ఆ ప్రయోజనాలు అందేలా జిఎస్‌టి అధికారులు పర్యవేక్షించాలన్నారు. కార్యక్రమంలో డిసిసిబి చైర్మన్ శివ్వాల సూర్యనారాయణ, జిఎస్‌టి అసిస్టెంట్ కమిషనర్ కింజరాపు వెంకటరమణ, మున్సిపల్ కమిషనర్ తమ్మినేని రవి, ఎంపిడిఒ రోణంకి వెంకట రావు, తహశీల్దార్ ఎస్.రాంబాబు, ప్రైవేట్ ఆడిట్ ప్రాక్టీషనర్ బుడుమూరు శ్రీనివాసరావు, జిఎస్‌టి అధికారులు, వ్యాపారులు, స్వయం సహాయక సంఘసభ్యులు తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాకుళం సిటీ: జిఎస్‌టి తగ్గింపుతో ప్రజలపై ఆర్థిక భారం తగ్గిందని, వస్తు సేవల తగ్గింపు ధరలకు లభ్యమవుతున్నాయని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. నగరంలో సోమవారం మున్సిపల్ హైస్కూల్ మైదానం నుంచి డే అండ్ నైట్, రామలక్ష్మణ, సూర్య మహల్ జంక్షన్ మీదుగా ఏడురోడ్ల కూడలి వరకు జిఎస్‌టిపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ బైక్‌ర్యాలీ నిర్వహించారు. ఎన్‌టిఆర్ మున్సిపల్ గ్రౌండ్‌లో ఈ నెల13 నుంచి నవంబర్ 19 వరకు జిఎస్‌టి ధరల తగ్గింపుపై ప్రత్యేక ప్రదర్శన ద్వారా ప్రజలకు అవగాహన కల్పించనున్నామని తెలిపారు. ర్యాలీలో నాయకులు, వ్యాపారులు పాల్గొన్నారు.

పలాస: జిఎస్‌టి తగ్గింపులో ప్రజలకు ప్రయోజనం చేకూరుతుందని ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. సూపర్ జిఎస్‌టి-సూపర్ సేవింగ్స్ కార్యక్రమంలో భాగంగా మున్సిపల్ కార్యాలయం నుంచి కాశీబుగ్గ పెట్రోల్ బంకు, జిడి పిక్చర్ బొమ్మ వరకూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం మున్సిపల్ కార్యాలయంలో మెప్మా సచివాలయం, మున్సిపల్ సిబ్బందితో పాటు ట్రేడర్లతో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎన్.రామారావు, వీపీసీబీ చైర్మన్ వజ్జ బాబూరావు, వీసిసెల్ రాష్ట్ర కార్యదర్శి లొడగల కామేశ్వరరావు యాదవ్, ఎఎంసి చైర్మన్ మల్లా శ్రీనివాసరావు, పీరుకట్ల విఠలరావు, గాలి కృష్ణారావు, బడ్డ నాగరాజు, దువ్వాడ శ్రీకాంత్, జోగ మల్లి, ఎంపిడిఒ వసంతకుమార్ పాల్గొన్నారు.

టెక్కలి రూరల్ : సూపర్ జిఎస్‌టి-సూపర్ సేవింగ్స్‌పై ఎంపిడిఒ ఎం.రేణుక ఆధ్వర్యాన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి కె.శైలజ, అసిస్టెంట్ లేబర్ అధికారి ఆర్.రాధాకుమారి, డిప్యూటీ ఎంపిడిఒ కె.సింహాద్రి, జిఎస్‌టి అధికారి జె.చంద్రశేఖర్, జూనియర్ కళాశాల లెక్చరర్లు ఎకనామిక్స్ సత్యనారాయణ, కామర్స్ పుష్పవతి, ఎపిఒ బి.గ్రసాద్ పాల్గొన్నారు.

మెళియాపుట్టి : మండల పరిషత్ కార్యాలయంలో సూపర్ జిఎస్‌టి- సూపర్ సేవింగ్స్‌పై ఎంపిడిఒ నరసింహప్రసాద్ పండా అవగాహన కల్పించారు. అనంతరం బైక్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎఒ దానకర్ణుడు, ఎంఇఒలు ఎస్.దేవేందరరావు, ఎం.పద్మనాభరావు, హౌసింగ్ ఎఇ గణేష్‌కుమార్ పాల్గొన్నారు.

పలాస : ర్యాలీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శిరీష

ఇచ్ఛాపురం : సూపర్ జిఎస్‌టి తగ్గింపుపై మున్సిపల్ కమిషనర్ ఆధ్వర్యాన తహశీల్దార్ కార్యాలయం నుంచి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో 11వవార్డు కౌన్సిలర్ ఆసి లీలారాణి, డిప్యూటీ అసిస్టెంట్ కమిషనర్ కాశీప్రసాద్ పండా, తహశీల్దార్ వెంకటరావు, ఎంపిడిఒ ఎ.ప్రభాకర్ పాల్గొన్నారు.

నందిగాం : మండల ప్రత్యేక అధికారి ఐ.వి.రమణ, ఎసిటిఒ చంద్రశేఖరరావు, లేబర్ ఆఫీసర్ విజయ్‌కుమార్, ఎంపిడిఒ కుమార్ పట్నాయక్, తహశీల్దార్ పి.సోమేశ్వరరావులు జిఎస్‌టి తగ్గింపు బైక్ ర్యాలీ నిర్వహించారు. ముందుగా ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కృష్ణమోహన్, అధ్యాపకులు పాల్గొన్నారు.

కవిటి: తగ్గించిన జిఎస్‌టి ఫలాలు ప్రతి ఒక్కరికీ అందాలని, వ్యాపారులందరూ జిఎస్‌టి తగ్గింపు బోర్డులు పెట్టాలని ఎంపిడిఒ త్రినాథ్ సూచించారు. సూపర్ జిఎస్‌టి తగ్గింపు ఎంపిడిఒ కార్యాలయం నుంచి రాజపురం మీదుగా జల్లుపుట్టుగ వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సెమినార్ ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు పొందల కృష్ణారావు, మండల విద్యాశాఖ అధికారి ధనుంజయ మజ్జి, డిప్యూటీ ఎంపిడిఒ వరప్రసాద్, ఎఒ శ్రీనివాసరెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ సింహాచలం నాయుడు, ఎపిఎం గోవిందరావు, ఇన్‌ఛార్జి ఎపిఒ మోహనరావు పాల్గొన్నారు.

కొనసాగుతున్న యాప్‌ల బహిష్కరణ

ప్రజాశక్తి- టెక్కలి

ఉపాధ్యాయ సమస్యలు, బకాయిపడిన డిఎలు విడుదల చేయాలని ఫ్యాప్టో ఆధ్వర్యాన యాప్‌ల బహిష్కరణ ఉద్యమం కొనసాగుతుంది. సోమవారం లీప్ యాప్‌లోని ఉపాధ్యాయుల హాజరు, డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకానికి సంబంధించిన యాప్ మాత్రమే వినియోగించారు. మిగిలిన యాప్‌లైన కర్మయోగి, లీప్ యాప్‌లో వివిధ అంశాలు నమోదు వంటివి బహిష్కరించారు. నైట్ వాచ్‌మెన్, స్వీపర్లకు సంబంధించిన ఐటెండెన్స్ యాప్, సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర యాప్‌లో కూడా బహిష్కరించారు. ప్రస్తుతం పాఠశాలలకు రెండో సెమిస్టర్ పుస్తకాలు విద్యార్థులకు సరఫరా అయ్యాయి. వీటి నమోదు ఈ యాప్‌లోనే చేపట్టాల్సి ఉంది. ఫ్యాప్టో పిలుపు మేరకు వాటిని బహిష్కరించారు. అదే విధంగా సోమవారం నుంచి ప్రారంభమైన ఎఫ్ఎ-2 పరీక్షలు మరో రెండు రోజుల్లో ముగియనున్నాయి. వీటి మూల్యాంకనాన్ని పూర్తి చేసి మార్కులు యాప్ ద్వారానే నమోదు చేయాల్సి ఉంది. కానీ వాటి నమోదు కూడా జరిగే పరిస్థితి కనిపించ లేదు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఫ్యాప్టో నాయకులతో చర్చించి సమస్యలను సామరస్యంగా పరిష్కరించాలని కోరుతున్నారు.

విద్యార్థినితో మాట్లాడుతున్న రమణ

టీచర్ అవతారమెత్తిన డిఎల్‌పిఒ

ప్రజాశక్తి- నందిగాం

టెక్కలి డివిజన్ పంచాయతీ విస్తరణాధికారి ఐ.వి.రమణ ఉపాధ్యాయుని అవతారమెత్తారు. మండలంలోని లఖిదాసుపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అర గంట పాటు పదో తరగతి విద్యార్థులకు పాఠ్యాంశాలకు సంబంధించిన మెలకువలు తెలిపారు. సోమవారం గ్రామాన్ని సందర్శించిన ఆయన పాఠశాలలో రూ.75 వేలు వ్యయంతో విద్యుత్ స్తంభాలు, గేటు వద్ద ఎల్ఇడి బల్బు ఏర్పాటుకు కావాల్సిన వాటిని పరిశీలించారు. అనంతరం పదో తరగతి విద్యార్థుల వద్దకు వెళ్లి అన్ని సబ్జెక్టులకు చెందిన వివిధ విషయాలపై మాట్లాడారు. వారి నుంచి సమాధానాలు రాబట్టి, సబ్జెక్టుల్లో మెలకువలు తెలియజెప్పి సంతృప్తి వ్యక్తం చేశారు. సుమారు నాలుగు దశాబ్దాల క్రితం తాను చదువుకున్న విషయాలను, అప్పటి గురువులను గుర్తుకుతెచ్చుకుని కాసేపు గడిపారు. పాఠశాల నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఈయనతో పాటు సర్పంచ్ బొంగి అమ్ములమ్మ, మాజీ సర్పంచ్ మాదిన లోకనాథం, కార్యదర్శి బి.స్వరూప్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు చిలుకు కృష్ణారావు, ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయులు కురమాన దాలయ్య పాల్గొన్నారు.

పతకాలతో విద్యార్థులు

విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి- టెక్కలి

ఎన్‌టిఆర్ క్రీడా వికాస్ కేంద్రానికి చెందిన తైక్వాండో విద్యార్థులు 69వ రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొని ప్రతిభ కనబరిచారని కోచ్ నర్సింహం శేఖర్ సోమవారం తెలిపారు. మొదట తపస్వి 35 కిలోల విభాగంలో బంగారం, జనపన అక్షయ 38 కిలోల విభాగంలో రజత, బాలుర విభాగంలో 38 కిలోల విభాగంలో వేములాడ వినయ్ రజత పతకాలు సాధించి ప్రతిభ చాటుకున్నారని తెలిపారు. అలాగే నవంబరులో పంజాబ్ రాష్ట్రం లుధియానాలో నిర్వహించనున్న జాతీయస్థాయి పోటీలకు మొదట తపస్వి ఎంపికైందన్నారు. విజేతలుగా నిలిచి ప్రతిభ కనబరిచిన వారిని జిల్లా క్రీడా విభాగం అధికారి డాక్టర్ కక్కిపల్లి శ్రీధర్, కోచ్ నర్సింహం శేఖర్లు అభినందించారు. విద్యార్థులకు కోచ్ పాండవుల జగదీష్, సురేష్, తరుణ్, అక్క సాగర్ అభినందించారు.

స్మితరాణి సాహుకు డాక్టరేట్

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

స్మితరాణి సాహు

టెక్కలి ఐతమ్ ఇంజినీరింగ్ కళాశాలలో ఐటి విభాగ అధ్యాపకులు స్మితరాణి సాహుకు డాక్టరేట్ వచ్చిందని డైరెక్టర్ వి.వి.నాగేశ్వరరావు సోమవారం తెలిపారు. ఒడిశాలోని దుర్శీలాలకు చెందిన బిజు పట్నాయక్ విశ్వవిద్యాలయం నుంచి 'డిజైన్ ఆన్ ఇంటర్ వెహికలర్ కమ్యూనికేషన్ సిస్టమ్ వాహనాల మధ్య సమర్థవంతమైన కమ్యూనికేషన్ సాధన కోసం నూతన రూటింగ్ పద్ధతులను అభివృద్ధి, సమర్థవంతమైన మార్గదర్శక పద్ధతులు' అనే ప్రయోగాత్మక పరిశోధనలో పిహెచ్‌డి పట్టా ప్రదానం చేశారని అన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇలాంటి పరిశోధనల వల్ల భవిష్యత్‌లో ఇంటర్ వాహిక్యులర్ స్మార్ట్ ట్రాన్స్‌పోర్ట్ సిస్టమ్‌ల అభివృద్ధికి ఉపయోగపడతాయని పేర్కొన్నారు. స్మితరాణి సాహుకు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, ఐటిహెచ్ఒడి డాక్టర్ బి.రమేష్‌నాయుడు అభినందించారు.

సంతకాలను సేకరిస్తున్న జెడ్‌పి చైర్‌పర్సన్ విజయ

పాలవలసలో సంతకాల సేకరణ

ప్రజాశక్తి- సోంపేట

కూటమి ప్రభుత్వం మెడికల్ కాలేజీలు ప్రైవేటీకరణ చేయొద్దని జెడ్‌పి చైర్‌పర్సన్ పిరియా విజయ డిమాండ్ చేశారు. మండలంలోని పాలవలస పంచాయతీలో మెడికల్ కళాశాలలు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా సంతకాలను సోమవారం సేకరించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజలకు వివరించారు. అనంతరం పార్టీ గ్రామ కమిటీలు, అనుబంధ కమిటీలు నియామకంపై చర్చించారు. కార్యక్రమంలో ఎంపిపి నిమ్మన దాసు, రౌతు విశ్వనాథం, వైసిపి మండల అధ్యక్షులు శిలగాన భాస్కరరావు, ఎంపిటిసి దుమ్ము ఢిల్లీరావు, సర్పంచ్‌లు శంకరరావు, కోట్ని శ్రీను, సకలబత్తుల హరీష్, శ్రీనివాసరావు, అన్నెపు నారాయణ, బొంగు దుర్యోధన, శివంగి శ్రీను పాల్గొన్నారు.

సమస్యలు తెలుసుకుంటున్న జనసైనికులు

ఇంటింటికీ జనసేన

ప్రజాశక్తి- కవిటి

మండలంలోని ఇద్దివానిపాలెం పంచాయతీ పరిధిలో ఇంటింటికీ జనసేన కార్యక్రమం సోమవారం నిర్వహించారు. బాలయ్య మాస్టారు ఆధ్వర్యాన నిర్వహించిన ఈ కార్యక్రమంలో గ్రామంలోని పాండురంగ వీధిలో ప్రజా సమస్యలపై ఫిర్యాదులు సేకరించారు. ప్రజా సమస్యలు తెలుసుకుని వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు. అనంతరం గ్రామంలోని జనసేన పార్టీ కార్యాలయం నుంచి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో జనసైనికులు, వీర మహిళలు, స్థానికులు పాల్గొన్నారు.

నిలిచిన మురుగు నీరు

ప్రజాశక్తి- ఎచ్చెర్ల

మురుగునీటితో నిండిన కాలువ

ఎచ్చెర్ల పంచాయతీ పరిధిలో ఎచ్చెర్ల నుంచి రాంనగర్ వెళ్లే రహదారి మార్గంలో కాలువలు మురుగు నీరుతో నిండి పోయి నీరు ఎటువైపు వెళ్లే మార్గం లేక దుర్వాసనతో, ప్లాస్టిక్ వ్యర్థాలతో నిండిపోయి నిలిచిపోయింది. చినుకు పడితే చాలు ఈ మురుగునీరు రోడ్డు మీదకు వచ్చి ఇటువైపు నుంచి వెళ్లే ప్రజలకు చాలా ఇబ్బందిగా ఉందని మారిందని ప్రజలు వాపోతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ తీసుకొని ఈ మురుగునీరు వెళ్లేందుకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఉద్యోగుల పనితీరుపై ఎమ్మెల్యే ఆగ్రహం

అధికారుల తీరుపై నిరసన వ్యక్తం చేస్తున్న వైసిపి సభ్యులు

ప్రజాశక్తి- సరుబుజ్జిలి

మండలంలోని వ్యవసాయ, పశువైద్య శాఖల పనితీరుపై ఎమ్మెల్యే కూన రవికుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిపి కిల్లి రమాదేవి అధ్యక్షతన జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సమావేశంలో ఎంపిడిఒ ఎం.పావని ఆధ్వర్యంలో వ్యవసాయ శాఖపై సమీక్ష చేపట్టగా ఎఒ మన్మధరావు నివేదికను సమర్పించారు. ఈ సందర్భంగా టిడిపి, వైసిపి సభ్యులు, జెడ్‌పిటిసి సురవరపు నాగేశ్వరరావు వ్యవసాయ శాఖ గ్రామాల్లో రైతులకు ఎటువంటి అవగాహన సదస్సులు నిర్వహించడం లేదని, ఎరువుల పంపిణీ కూడా అస్తవ్యస్తంగా నిర్వహించారన్నారు. తెలికి పెంట గ్రామ పంచాయతీ ఎల్.పి.ఎం అగ్రహారంలో యాదవులకు చెందిన గొర్రెలకు వ్యాధి సోకిన సందర్భంలో పశువైద్య శాఖకు ఫోన్ చేసినా అధికారులు స్పందించకపోవడంతో 25 గొర్రెలు మృతి చెందాయని టిడిపి సభ్యుడు నందివాడ గోవిందరావు పశువైద్య సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. 2014-19 మధ్య పశువైద్య శాఖ ఆధ్వర్యంలో గోకులం నిర్మాణాల కోసం రైతులు చెల్లించిన డబ్బులు నేటికీ తిరిగి చెల్లించకపోవడంపై ఇసుకలపాలెం సర్పంచ్ పల్లి సురేష్ అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ విషయాలపై ఎమ్మెల్యే రవికుమార్ మాట్లాడుతూ రైతు కష్టాన్ని నిర్లక్ష్యం చేసే అధికారులను క్షమించమని, భవిష్యత్‌లో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకూడదని అధికారులను హెచ్చరించారు. మండల, జిల్లా పరిషత్ నిధులతో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై వైసిపి, టిడిపి సభ్యుల మధ్య వాదోపవాదాలు చెలరేగడంతో సమావేశం కొద్దిసేపు రసాభాసగా మారింది. ఈ సమయంలో ఎస్ఐ బి.హైమావతి సిబ్బందితో అక్కడకు చేరుకొని పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చారు. సమావేశంలో మండల ప్రత్యేక ఆహ్వానితులు కెవిజి సత్యనారాయణ, వైస్ ఎంపిపిలు శివానందమూర్తి, అనిల్‌కుమార్, వివిధ శాఖల అధికారులు, సర్పంచ్‌లు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.

హర్యానా డిజిపిని అరెస్టు చేయాలి

ప్రజాశక్తి- టెక్కలి

దళిత నాయకుడు, సీనియర్ ఐపిఎస్ అధికారిపై హత్యానేరం మోపి, అన్యాయంగా వ్యవహరిస్తున్న హరియానా రాష్ట్రం డిజిపి శత్రుజీత్ సింగ్‌ని తక్షణమే అరెస్టు చేయాలని దళిత మహాసభ జిల్లా అధ్యక్షులు బోకర నారాయణరావు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. సమాజంలో ఇంకా కొనసాగుతున్న కులవివక్షత వల్ల అర్థాంతరంగా ప్రాణాలు కోల్పోవాల్సి పరిస్థితి ఏర్పడుతుందని అన్నారు. దుర్మార్గులకు రక్షణగా వ్యవహరిస్తున్న రాజకీయ వ్యవస్థపై ప్రజలకు నమ్మకం కోల్పోతుందన్నారు. సీనియర్ ఐపిఎస్ అధికారులకు రక్షణ లేకపోతే ఇక సామాన్యుల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు.

సుభాష్ చంద్రబోస్ విగ్రహ ఏర్పాటుకు చర్యలు

ప్రజాశక్తి- అరసవల్లి

సహజంగా ఉండే సుభాష్ చంద్రబోస్ విగ్రహానికి భిన్నంగా ఆజాద్ హింద్ ఫోర్స్ రోజులు ప్రతిబింబించేలా చంద్రబోస్ గుర్రంపై సవారీ చేస్తూ ఉండే విగ్రహాన్ని కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు ఆధ్వర్యంలో ప్రత్యేకంగా కలకత్తాలో నెలరోజుల పాటు కార్మికులు తయారు చేశారు. ఎమ్మెల్యే గొండు శంకర్ ఆదేశానుసారం కొత్తరోడ్డు జంక్షన్‌లో నేతాజీ విగ్రహన్ని ఏర్పాటు చేయనున్నట్లు టిడిపి వర్గాలు ఒక ప్రకటనలో తెలిపారు.

పర్యావరణాన్ని కాపాడుదాం

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

పర్యావరణం కాపాడటం ప్రతిఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. నగరంలో స్థానిక 80 ఫీట్ రోడ్‌లో బృందావన్ ఫంక్షన్ హాల్‌లో సోషల్ మీడియా ఇన్ఫ్లెన్సర్లు సోమవారం నిర్వహించిన డిజిటల్ క్రియేట్ మూమెంట్ ఇకో 75 కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణాన్ని పరిరక్షించాలన్నారు. కాలుష్య నియంత్రణ మొక్కలు పెంచటంతోనే సాధ్యమని వివరించారు. ప్రస్తుతం యువత కాలుష్య రహిత సమాజం కోసం కృషిచేయాలన్నారు. కాలుష్య రహిత నగరంగా శ్రీకాకుళం తీర్చిదిద్దే ప్రయత్నం చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో నగర కమిషనర్ ప్రసాదరావు పాల్గొన్నారు.

దళితుల నిరసన ర్యాలీ

ర్యాలీ నిర్వహిస్తున్న దళితులు

కొత్తూరు: స్థానిక తహశీల్దార్, సిబ్బందిపై భూహక్కు పత్రం మంజూరు విషయమై దురుసుగా ప్రవర్తించి, తప్పుడు ఆరోపణలు చేసి, భౌతిక దాడులకు పాల్పడిన వారిని వెంటనే అరెస్టు చేయాలని దళిత మహాసభ మండల శాఖ అధ్యక్షుడు టొంపల తిరుపతిరావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు సిర్ల ప్రసాద్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా దళితులు సోమవారం మండల కేంద్రంలో ప్లకార్డులు చేతబట్టి నిరసన ర్యాలీ చేపట్టారు. తహశీల్దార్ కె.బాలకృష్ణ, రెవెన్యూ సిబ్బంది ముగడ మహేంద్ర, జయరాంలకు బలదకు చెందిన మహిళ ప్రభుత్వ స్థలంలో నిర్మించుకున్న ఇళ్లకు పొజిషన్ ధ్రువపత్రం ఇవ్వాలని దరఖాస్తు చేస్తుందని అన్నారు. దీనిపై తహశీల్దార్ నిబంధనలు ప్రకారం పొజిషన్ ధ్రువపత్రం ఇవ్వడం సాధ్యం కాదని తెలియజేస్తూ... ఆమెపై దురుసుగా ప్రవర్తించి భౌతిక దాడులకు పాల్పడడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. అనంతరం టెక్కలి డిఎస్‌పిని కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పడాల నాగభూషణరావు, దుర్గాశి, జమ్మయ్య, ఉద్యోగ సంఘ నాయకులు రాజగోపాల్, అల్లు తిరుపతి రావు, జానకిరామయ్య, గిరీష్ పట్నాయక్, చుక్కా రాంబాబు, దళిత ఉద్యోగ, ఉపాధ్యాయ, ప్రజా సంఘాల నాయకులు రామకృష్ణ, సింహాచలం, రామారావు, ఎండు నాయుడు, సూరిబాబు, ప్రశాంత్, మహేష్, శంకర్ పాల్గొన్నారు.

విధుల్లోకి చేరిన నూతన ఉపాధ్యాయులు

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలకు ప్రభుత్వం నిర్వహించిన డిఎస్‌లో భాగంగా 90 మంది నూతన ఉపాధ్యాయులు విధుల్లో సోమవారం చేరారు. ఇందులో ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో 37 మంది, ఉన్నత పాఠశాలల్లో 49 మంది, క్లస్టర్ పరిధిలో నలుగురు ఉపాధ్యాయులు విధుల్లో చేరారు. నూతన ఉపాధ్యాయులకు ఎంఇఒలు కురమాన అప్పారావు, ఎస్.విశ్వనాథం పాఠశాలల, తరగతుల నిర్వహణపైన విలువైన సూచనలు, సలహాలు ఇచ్చారు. పాఠశాల బలోపేతానికి నూతన ఉపాధ్యాయుల సహకారంతో ఉత్తమ బోధన, మెరుగైన ఫలితాలు సాధించాలని శుభాకాంక్షలు చెప్పారు. కార్యక్రమంలో ఎంఆర్‌సి సిబ్బంది రవికుమార్, ఆర్.దేవరాజు, కె.సోమేశ్వరరావు, సిహెచ్.సత్యనారాయణ, మోహనరావు, బి.గణేష్, ఆర్.తులసీరావు, సూర్యం, రాంబాబు పాల్గొన్నారు.

కవిటి: కొత్తగా విధుల్లోకి చేరిన ఉపాధ్యాయులు విద్యార్థుల మనసెరిగి బోధన కొనసాగించి ఆదర్శంగా నిలవాలని మండల విద్యాశాఖ అధికారులు ధనంజయ మజ్జి, సనపల రామకృష్ణ సూచించారు. మండలంలో 126 ఉపాధ్యాయ పోస్టులు ఖాళీ ఉండగా, మెగా డిఎస్‌సి ద్వారా అందులో 85 పోస్టులు భర్తీ చేశారు. ఈ మేరకు కొత్త ఉపాధ్యాయులు సోమవారం విధుల్లోకి చేరారు. వీరికి మండల విద్యాశాఖ అధికారులతో పాటు సహ ఉపాధ్యాయులు శుభాకాంక్షలు తెలిపారు.

ఇచ్ఛాపురం : నియామక పత్రాలతో నూతన ఉపాధ్యాయులు

పొష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం ...

అవగాహన కల్పిస్తున్న పిఒ శోభారాణి

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

ప్రజాశక్తి- నరసన్నపేట

అంగన్వాడీ కేంద్రాలకు వచ్చిన పౌష్టికాహారంతోనే పిల్లలకు, గర్భిణులకు, బాలింతలకు సంపూర్ణ ఆరోగ్యమని ఐసిడిఎస్ పిఒ శోభారాణి అన్నారు. ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో పోలాకి, నరసన్నపేట అంగన్వాడీ కార్యకర్తలకు సోమవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జెమ్స్ ఆస్పత్రి వైద్యులు పాల్గొని పిల్లలు ఆరోగ్యంగా ఉండాలంటే తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. అలాగే చిన్నారులకు తల్లిపాలు ప్రాధాన్యత వివరించారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. సీజనల్ వ్యాధులు రాకుండా తీసుకోవలసిన జాగ్రత్తలు వివరించారు. అత్యవసర పరిస్థితిలో జెమ్స్‌కు రిఫర్ చేస్తే ఉచితంగా వైద్యం, మందులు సరఫరా చేస్తామని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వైసిపి రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా గురయ్యనాయుడు

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

గురయ్యనాయుడు

వైసిపి రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా వజ్రపుకొత్తూరుకు చెందిన పుక్కళ్ల గురయ్య నాయుడును నియమిస్తూ ఉత్తర్వులు అందినట్లు సోమవారం ఆయన తెలిపారు. వైసిపి మండల అధ్యక్షునిగా సుదీర్ఘ కాలం పాటు సేవలు అందిస్తూ పార్టీ బలోపేతానికి తనవంతు కృషి చేశారు. తనపై నమ్మకం ఉంచి రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా నియమించినందుకు మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్, మాజీ మంత్రి సీదిరి అప్పలరాజుకు ధన్యవాదాలు తెలిపారు. పార్టీ తనపై ఉంచిన నమ్మకాన్ని ఒమ్ము చేయకుండా పార్టీ బలోపేతానికి తనవంతు కృషి చేస్తానని తెలిపారు.

యువతకు ఉద్యోగ కల్పనే లక్ష్యం

శ్రీకాకుళం రూరల్: యువకులకు ఉద్యోగ కల్పనే లక్ష్యమని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. విశాఖ ఎ కాలనీలో సోమవారం ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ కేంద్రంలో సెప్టెంబరు 27న టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ లిమిటెడ్ ఆధ్వర్యంలో మహిళా విభాగంలో ట్రైనీ పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు ఎంపికైన వారికి నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఉద్యోగాల కల్పన దిశగా అడుగులు వేస్తుందని, ప్రతి నిరుద్యోగికి ఉద్యోగ అవకాశం కల్పించడమే తమ ధ్యేయమన్నారు. కార్యక్రమంలో టాటా ప్రాజెక్ట్ కో-ఆర్డినేటర్ సంతోష్ కుమార్, నైపుణ్య శిక్షణ అధికారి వి.రఘురాం తదితరులు పాల్గొన్నారు.

నియామక పత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే శంకర్

గాయపడిన వ్యక్తి మృతి

ప్రజాశక్తి- పోలాకి

మండలంలోని రాల్లపాడులో గాయపడిన వ్యక్తి సోమవారం మృతి చెందారని ఎస్ఐ జి.రంజిత్ తెలిపారు. బోర నీలం (45) ఈ నెల 2న నరసన్నపేట నుంచి స్వగ్రామం రాల్లపేట ద్విచక్ర వాహనంపై వెళ్తున్నాడు. మార్గంమధ్యలో ఉన్న ఓట దగ్గర తాటి చెట్టు ఆయనపై పడిపోయింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే కుటుంబ సభ్యులు శ్రీకాకుళంలోని ఓ ప్రయివేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

ప్రజాశక్తి- పొందూరు



ఉమామహేశ్వరరావు (ఫైల్)

మండలంలోని పుల్లాజిపేటలో సోమవారం విద్యుత్‌షాక్‌కు గురై జాడ ఉమా మహేశ్వరరావు (38) మృతి చెందాడు. పోలీసులు, గ్రామస్తుల వివరాల మేరకు గ్రామంలో పి.సుబ్బారావు ఇంట్లో గీజర్ పాడవ్వడంతో మృతుడు ఉమామహేశ్వరరావు వాటికి మరమ్మతులు చేస్తుండగా ఒక్కసారిగా విద్యుత్ సరఫరా కావడంతో షాక్‌కు గురయ్యాడు. దీన్ని గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే శ్రీకాకుళం ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడు స్వగ్రామం పొందూరు మండలంలోని మలకాం కాగా సుమారు 13 ఏళ్ల క్రితం పుల్లాజీపేటకు చెందిన నాగమణితో వివాహమైంది. నాగమణి తండ్రి శ్రీనివాసరావు ఒంటరి కావడంతో ఆయనకు చేదోడువాదోడుగా ఉండేందుకు ఎలక్ట్రిషన్ పనులు చేసుకుంటూ అత్తవారి గ్రామంలో స్థిరపడ్డాడు. ఎలక్ట్రిషన్ పనులు చేసుకుంటూ వచ్చిన ఆదాయంతో కుటుంబాన్ని పోషించుకోవడంతో పాటు స్వగ్రామంలో ఉన్న తల్లిదండ్రులు రామకృష్ణ, రామలక్ష్మిలకు ఆర్థికంగా చేదోడువాదోడుగా నిలిచేవాడు. మృతునికి భార్యతో పాటు కుమార్తె ప్రణన్య ఉంది. ఉమామహేశ్వరరావు మృతితో రెండు గ్రామాల్లో విషాదఛాయలు అలముకున్నాయి. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్ఐ సత్యనారాయణ తెలిపారు.

క్రైమ్ కార్నర్

11మందిపై కేసు నమోదు

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురం మున్సిపాలిటీ పరిధి అప్పన్నపేటలో ఉన్న కాళ్ల పాపారావు, సత్యసాయిబాబా వీధిలో ఉంటున్న దాసరి రాజు కుటుంబాల మధ్య ఆదివారం రాత్రి ఘర్షణ చోటు చేసుకుంది హెచ్‌సి బి.వల్లభ తెలిపారు. రాజు భార్య మోహిని ఫిర్యాదు మేరకు రాజుతో పాటు మరో ముగ్గురుపై, అలాగే రాజు తల్లి దాసరి ఆదిలక్ష్మి ఫిర్యాదు మేరకు పాపారావు, మరో ఆరుగురుపై కేసులు నమోదు చేశామన్నారు. కొట్లాటతో గాయపడిన క్షతగాత్రులను స్థానిక సామాజిక ఆస్పత్రికి తరలించామన్నారు.

యువకుడు ఆత్మహత్యాయత్నం

సంతబొమ్మాళి : మండలంలోని ఎర్రాగులుపేటకు చెందిన అనిల్ అనే యువకుడు సోమవారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. నౌపడ నుంచి టెక్కలి వెళ్లే రహదారి ఇజ్జువరంలో ఉన్న ఓ బస్‌షెల్టర్ వద్ద పురుగుల మందు తాగి స్నేహితులకు ఫోన్ సమాచారం అందించాడు. వెంటనే అప్రమత్తమైన స్నేహితులు అతడిని బైక్‌పై టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు. వైద్యులు చికిత్స అందిస్తున్నారు. ప్రేమ వ్యవహారంగా పలువురు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

అట్రాసిటీ కేసుపై దర్యాప్తు

ప్రజాశక్తి- కొత్తూరు

స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో ఇటీవల భూహక్కు పత్రం విషయమై బలదకు చెందిన అరుబోలు కమల, దేవాడ చంద్రశేఖర్, శనపల రవి, తహశీల్దార్ కె.బాలకృష్ణల మధ్య వివాదం చోటు చేసుకుంది. దీంతో ఇరువురు ఫిర్యాదులపై సోమవారం తహశీల్దార్ కార్యాలయంలో టెక్కలి డిఎస్‌పి డి.లక్ష్మణరావు అట్రాసిటీ కేసుపై తహశీల్దార్‌తో పాటు సాక్షులను విచారించారు. నివేదికను ఉన్నతాధికారులకు అందజేయనున్నట్లు డిఎస్‌పి తెలిపారు.

విద్యుత్ షాక్‌తో మృతి చెందిన ఆవు

విద్యుదాఘాతంతో ఆవు మృతి

ప్రజాశక్తి- లావేరు

విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఓ మూగజీవం బలైంది. మండలంలోని చిన్నయ్యపేటలో సోమవారం తెల్లవారి రైతు మీసాల శ్రీరామ్మూర్తి ఆవును తీసుకొని వస్తుండగా గ్రామంలో గ్రామానికి విద్యుత్ సరఫరా అవుతున్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ సమీపంలోకి రాగానే విద్యుత్ భూమికి సరఫరా అవ్వడంతో పాటు చిన్న వర్షం పడును ఉండడంతో ఒక్కసారిగా ఆవు విద్యుత్ షాక్ తగిలి అక్కడికక్కడే మృతి చెందింది. ఆవు పడి పోయిందని రైతు ఆతృతగా పట్టుకొనేందుకు ప్రయత్నం చేయడంతో ఆయనకు షాక్ కొట్టగా ఆయన కాళ్లకు చెప్పులు ఉండడంతో ప్రమాదం నుంచి ప్రాణాలతో బతికి బయటపడ్డాడు. తమకు జీవనాధారణమైన సుమారు రూ.80 వేలు విలువ గల ఆవు మరణించడంతో దానికి కారణం విద్యుత్ అధికారుల నిర్లక్ష్యమేనని, పలుమార్లు విద్యుత్ శాఖ ఎఇ దృష్టికి సమస్యను విన్నవించినా పట్టించుకోలేదని బాధిత రైతు శ్రీరామ్మూర్తి, చిన్నయ్యపేట సర్పంచ్ కలిశెట్టి భాస్కరరావు ఆరోపించారు. ట్రాన్స్‌ఫార్మర్‌కి ఎర్త్ బోర్డు, ఫీజు బోర్డు లేకపోవడం, అంతా చిందర వందరగా ఉండి అక్కడ ఎటువంటి భద్రత చర్యలు లేకపోవడంతోనే ఇలా జరిగిందని, తనకు విద్యుత్ అధికారులు నష్టపరిహారం చెల్లించాలన్నారు. మండలంలో ఇటీవల బొడ్డపాడు, ఇజ్జాడపాలెం, కుంకాం చిన్నయ్యపేట గ్రామాల్లో విద్యుత్ షాక్‌తోనే ముగజీవాలు బలయ్యాయి. దీనికి విద్యుత్ అధికారులే కారణమని, ట్రాన్స్‌ఫార్మర్లు వద్ద ఎటువంటి భద్రతా చర్యలు తీసుకోనందునే ఈ ప్రమాదాలు జరిగాయని, ఈ సంఘటనలన్నీ గ్రామాల్లోనే జరిగాయన్నారు. ఇప్పటికైనా విద్యుత్ ఉన్నతాధికారులు స్పందించి అటువంటి దగ్గర ప్రమాదాలకు ఆస్కారం లేకుండా భద్రతా చర్యలు తీసుకోవాలని ప్రజలు, రైతులు కోరుతున్నారు.

జూదరుల అరెస్టు

ప్రజాశక్తి- కవిటి

మండలంలోని మాణిక్యపురంలో సోమవారం మధ్యాహ్నం పేకాట శిబిరంపై దాడి చేసి ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్టు ఎస్ఐ రవివర్మ తెలిపారు. ముందస్తు సమాచారం మేరకు ఘటన స్థలానికి వెళ్లామన్నారు. పేకాట ఆడుతూ ఐదుగురిని అదుపులోకి తీసుకొని వారి వద్ద రూ.10,620 స్వాధీనం చేసుకున్నారు. వీరిపై కేసు నమోదు చేశామని తెలిపారు.

ముందుచూపుతో విపత్తుల నియంత్రణ

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

ముందు చూపుతో ప్రకృతి విపత్తుల నుంచి గట్టెక్కవచ్చునని జిల్లా ఇండియన్ రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు అన్నారు. భారత ప్రభుత్వం యువజన వ్యవహారాలు, క్రీడలు మం త్రిత్వశాఖ, యువ భారత్, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల (పురుషులు) సమావేశ మందిరంలో సోమవారం అంతర్జాతీయ విపత్తు నివారణ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ విపత్తులు వల్ల అప్రమత్తంగా లేకపోతే ప్రాణనష్టం సమస్యగా మారతుందన్నారు. ముందస్తు జాగ్రత్తలు, ప్రకృతి విపత్తులు శాఖ సూచనలు పాటించటం వలన సమర్ధవంతంగా విపత్తులు ఎదుర్కొ వచ్చునన్నారు. యువ భారత్ డిప్యూటీ డైరెక్టర్ కె.వెంకట్ ఉజ్వల్ మాట్లాడుతూ ప్రతి ఏడాది అక్టోబర్ 13న అంతర్జాతీయ విపత్తు నివారణ దినోత్సవం జరుపుకుంటామన్నారు. విపత్తులపై యువతకు అవగాహన

మాట్లాడుతున్న జగన్మోహనరావు

కల్పించటం లక్ష్యంగా వివరించారు. కార్యక్రమంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కె.శ్రీరాములు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారి శ్రీనివాస పాత్రో, వైస్ ప్రిన్సిపాల్ ఎం.వి.సత్యనారాయణ, ఆర్థికశాస్త్ర అధ్యాపకులు సి.హెచ్.రామ్మోహన్, పెంకి చైతన్య కుమార్, కామర్స్ అధ్యాపకులు పావని, మేర యువ భారత్ వాలంటీర్స్ గార మౌనిక, కొయ్యాన మధు పాల్గొన్నారు.

గూగుల్ అడుగుతో విశాఖలో టెక్ విప్లవం

ప్రజాశక్తి- శ్రీకాకుళం రూరల్

సిటీ ఆఫ్ డెస్టినిగా ఉన్న విశాఖపట్నం నేడు ఎఐ, డిజిటల్ సిటీకి రాజధానిగా మారనుందని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. మండలంలోని కిష్టప్ప పేటలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ విశాఖ ఎఐ సిటీగా మారితే, ఎపి దేశానికి డిజిటల్ ఇండియాలో మార్గదర్శకంగా నిలుస్తుందని, సాంకేతిక రంగం ఒక రాష్ట్ర భవిష్యత్ ఎలా మార్చగలదో హైదరాబాద్ ముఖ్య ఉదాహరణ అన్నారు. చంద్రబాబు దూరదృష్టితో మైక్రోసాఫ్ట్ సంస్థను హైదరాబాద్‌కు తీసుకురావడంతో హైదరాబాద్ అభివృద్ధికి ఒక గేమ్ చేంజర్‌గా మారిందన్నారు. గూగుల్ సంస్థ విశాఖలో రూ.87, 500 కోట్ల పెట్టుబడి పెట్టి సౌత్ ఏషియాలోనే అతిపెద్ద డేటా సెంటర్ క్లస్టర్‌ను నిర్మించబోతోందని, ఇది రాష్ట్రాభివృద్ధిలో ఒక మైలురాయిగా మారనుందన్నారు. గూగుల్ రాకతో మరెన్నో ఐటి, ఎఐ కంపెనీలు రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడానికి క్యూ కట్టనున్నాయన్నారు. గత ఐదేళ్ల ఎటువంటి ఐటి కంపెనీని

మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంకర్

ఏపీలో ఏర్పాటు చేయలేదని, నేడు ఐటీ రంగం విస్తరణకు విశాఖ సాగర తీరంలో డేటా సెంటర్, ఓపెన్ కేబుల్ ల్యాండింగ్ స్టేషన్‌కు మంత్రి లోకేష్ శంకుస్థాపనతో అంకురార్పణ జరిగిందన్నారు. సమావేశంలో జి.వెంకటరమణమూర్తి, వై అమ్మాజీరావు తదితరులు పాల్గొన్నారు.

22 మద్యం సీసాలు స్వాధీనం

లావేరు: మండలంలోని గుమ్మాడాంలో సోమవారం సాయంత్రం దళితవాడలో అక్రమంగా మద్యం అమ్ముతుండగా అదే గ్రామానికి చెందిన గందవరపు రమణను అదుపులోకి తీసుకుని 22 మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ జి. లక్ష్మణరావు తెలిపారు. అక్రమంగా మద్యం అమ్మినా, తరలించిన కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఎస్ఐ తెలిపారు ఈదాడుల్లో పోలీసు సిబ్బంది పాల్గొన్నట్లు హెచ్‌సి జోగారావు తెలిపారు.

చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే ఈశ్వరరావు, తదితరులు

సిఎం సహాయనిధి అందజేత

లావేరు: సిఎం సహాయనిధిని బాధితులు సద్వినియోగం చేసుకోవాలని ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు అన్నారు. మండలం చిన్నయ్యపేటకు చెందిన కలిశెట్టి నరసింహులుకు ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన రూ.50 వేలు ఆర్థికసాయం చెక్కును సోమవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అందజేశారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు ముప్పిడి సురేష్, టిడిపి జిల్లా మాజీ అధ్యక్షులు చౌదరి బాబ్జి, చిన్నయ్యపేట సర్పంచ్ కలిశెట్టి భాస్కరరావు, జల్లెపల్లి జనార్దన్ ఠాగూర్, గురుగుబిల్లి సర్పంచ్ బాడిత లక్ష్మణరావు, చిట్టిబాబు, కుమారాపు రవికుమార్, కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఫిర్యాదులపై శ్రద్ధ వహించాలి

ఫిర్యాదులు స్వీకరిస్తున్న అదనపు ఎస్‌పి శ్రీనివాసరావు

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

ఫిర్యాదుల పరిష్కారంపై శ్రద్ధ వహించాలని అదనపు ఎస్‌పి పి.శ్రీనివాసరావు అన్నారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల స్వీకరణ, పరిష్కార వేదిక కార్యక్రమంలో అర్జీదారుల నుంచి వినతులు స్వీకరించారు. పూర్తిస్థాయిలో పరిష్కరిస్తామని భరోసా కల్పించారు. ఫిర్యాదుదారుల అర్జీలు, వారి వివరాలు సంబంధిత పోలీసు అధికారులకు జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా తెలియజేశారు. చట్ట ప్రకారం విచారణ జరిపి బాధితులకు న్యాయం చేయాలని అధికారులకు అదేశించారు. వృద్ధులు, వికలాంగ అర్జీదారుల వద్దకు వెళ్లి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఆయా ఫిర్యాదులపై నిర్లక్ష్యం చేయకుండా, తీసుకున్న చర్యలను నిర్ణీత సమయంలో జిల్లా పోలీస్ కార్యాలయానికి నివేదిక రూపంలో పంపించాలని అధికారులను ఆదేశించారు.

యువత మత్తుకు బానిస కావద్దు

మాట్లాడుతున్న డిఎస్‌పి వివేకానంద

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, భవిష్యత్‌కు బంగారు బాటలు వేసుకోవాలని డిఎస్‌పి వివేకానంద విద్యార్థులకు సూచించారు. అఖిలభారత యువజన సమాఖ్య రాష్ట్రసమితి పిలుపుమేరకు ఎఐవైఎఫ్ జిల్లా సమితి ఆధ్వర్యంలో పట్టణంలోని సన్ డిగ్రీ, పీజీ కళాశాల ఆడిటోరియంలో సోమవారం హలో యువత మేలుకో, మత్తు పదార్థాల నుంచి నిన్ను నువ్వు కాపాడుకో, స్టాఫ్ డ్రగ్స్ స్టార్ట్ స్పోర్ట్స్ నినాదంతో సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెడు అలవాట్లు మొదట సరదాగా ప్రారంభమై తర్వాత వ్యసనంగా మారి జీవితాలను బలి కొంటాయన్నారు. తల్లిదండ్రులు పిల్లల భవిష్యత్ కోసం పడుతున్న కష్టాన్ని గుర్తించాలన్నారు. కార్యక్రమంలో ఎఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మొజ్జాడ యుగంధర్, పరుచూరి రాజేంద్రబాబు, సన్ విద్యాసంస్థల చైర్మన్ జయరాం, ఎఐవైఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బొత్స సంతోష్ కుమార్, కోన్న శ్రీనివాసరావు, నగర కన్వీనర్ వేణు పాల్గొన్నారు.

చంద్రబాబు, పవన్ చిత్రపటాలకు పాలాభిషేకం

ప్రజాశక్తి- ఆమదాలవలస

ప్రభుత్వం ఇటీవల కార్యదర్శులను పంచాయతీ డెవలప్‌మెంట్ ఆఫీసర్లుగా పదోన్నతి కల్పిస్తూ ఉత్తర్వులు జారీచేసిన నేపథ్యంలో మండల వ్యాప్తంగా ఉన్న కార్యదర్శులు ఆనందం వ్యక్తం చేశారు. సోమవారం పట్టణంలోని ఓ ప్రైవేటు కల్యాణ మండపంలో ఎమ్మెల్యే కూన రవికుమార్ సమక్షంలో కార్యదర్శులు సమావేశమై, సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించారు. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం స్థానిక సంస్థల బలోపేతానికి, గ్రామీణాభివృద్ధికి కీలకంగా నిలుస్తుందన్నారు. కార్యదర్శుల సంఘ నాయకులు బగాది నాగరాజు, సీపాన హరీష్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రవికుమార్ మాట్లాడుతూ కార్యదర్శులు గ్రామస్థాయి పరిపాలనలో కీలక భూమిక వహిస్తున్నారన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపిడిఒ అన్నెపు గోపాల రావు, కార్యదర్శులు, సర్పంచ్‌లు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.

కల్తీ మద్యం నిరూపించాలి

ప్రజాశక్తి- పలాస

పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీలో కల్తీ మద్యం విక్రయిస్తున్నట్లు మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు నిరూపిస్తే రాజకీయాల నుంచి తప్పుకుంటామని, మద్యం వ్యాపారస్తులకు గుండు కొట్టిస్తానని ఎపిటిపిసి చైర్మన్ వజ్జి బాబూరావు సవాల్ విసిరారు. తన స్వగృహంలో సోమవారం విలేకరులతో మాట్లాడారు. వైసిపి ప్రభుత్వంలో కల్తీ మద్యం విక్రయించారని ఆరోపించారు. వైసిపి ప్రభుత్వంలో మద్యం అధిక ధరలకు విక్రయించారని అన్నారు. స్థానిక ఎమ్మెల్యే, కుటుంబ సభ్యులపై ఆరోపణలు చేయడం తగదన్నారు. ఎమ్మెల్యే ఏడాదిన్నర కాలంలోనే రెండు పర్యాయాలు శివారు భూములకు వంశదార సాగునీరు, మున్సిపాలిటీకి తాగునీరు అందించారని గుర్తు చేశారు. కాశీబుగ్గ రైల్వే వంతెన పనులు చురుగ్గా సాగుతున్నాయని అన్నారు. తాళభద్ర వంతెనకు రూ.47 కోట్లు

సమావేశంలో మాట్లాడుతున్న బాబూరావు

మంజూరు చేశారని అన్నారు. కేంద్రీయ విద్యాలయం మంజూరు చేయించిన ఘనత ఆమెదేనన్నారు. సమావేశంలో ఎఎంసి చైర్మన్ మల్లా శ్రీనివాసరావు, లొడగల కామేశ్వరరావు, గాలి కృష్ణారావు, బడ్డ నాగరాజు, ఎం.నరేంద్ర (చిన్ని), చంద్రశేఖరత్యాడి, సాసుమాన చంద్రమౌళి, సవర రాంబాబు, సప నవీన్ పాల్గొన్నారు.

ప్రభుత్వంపై విమర్శలు సరికావు

ప్రజాశక్తి- కొత్తూరు

కూటమి ప్రభుత్వంపై విమర్శలు చేయడం సరికాదని టిడిపి మండల అధ్యఓఉలు అగతముడి మాధవరావు, పిఎసిఎస్ అధ్యక్షులు మాతల గాంధీ, పిఎసిఎస్ మాజీ అధ్యక్షులు అగముడి అరుణ్‌కుమార్‌లు అన్నారు. టిడిపి కార్యాలయంలో సోమవారం విలేకరులతో మాట్లాడారు. ఇటీవల తహశీల్దార్ కె.బాలకృష్ణ, ఎపిఎం లలితపై చేసిన దాడులు కూటమి నాయకులపై నెట్టడం అర్థరహితం అన్నారు. వైసిపి నాయకులు వెనుక నుంచి పరోక్షంగా దాడులు చేసి... తిరిగి కూటమి నాయకులపై నెట్టడం విడ్డూరంగా ఉందన్నారు. గతంలో వైసిపి అధికారంలో ఉన్న సమయంలో ఎమ్మెల్సీ అనంతబాబు కారు డ్రైవర్‌ను హత్య చేసి డెలివరీ చేయడం, దళిత జడ్జి రామకృష్ణపై చేసిన దాడి వైసిపి నాయకులు మరిచిపోయారా అని ఎద్దేవా చేశారు. సమావేశంలో. సర్పంచ్ లోతుగెడ్డ భగవాన్ దాస్‌నాయుడు, మడపాన

మాట్లాడుతున్న కూటమి నాయకులు

రాజారావు, కూటమి నాయకులు ఆరుబోలు దశరథ, డి.జయరాజ్, వి.ప్రసాదరావు, ఎం.కృష్ణ, సిహెచ్.కోటిబాబు, రాము, శివకృష్ణ పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేస్తున్న శ్రీనివాస రౌళో

రైల్వే ఫెన్సింగ్ ఆపాలని వినతి

ప్రజాశక్తి- కవిటి

మండలంలోని ఆర్.కరాపాడుకు ఎన్‌హెచ్-16 నుంచి వెళ్లే ఏకైక రోడ్డు మీద రైల్వే అధికారులు ఇనుము ఫెన్సింగ్ వేయడంతో రాకపోకలు పూర్తిగా ఆగిపోయే పరిస్థితి నెలకొందని, వెంటనే ఫెన్సింగ్ పనులు విరమించుకోవాలని జడ్ఆర్‌యుసి మెంబర్ శ్రీనివాస రౌళో కోరారు. ఈ మేరకు పలాస రైల్వే ఇన్‌స్పెక్టర్ ఎస్.ఎన్.పండాను సోమవారం కలిసి వినతిపత్రం అందించారు. అనంతరం మాట్లాడుతూ కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కరించాలని కోరారు. రైల్వే ఫెన్సింగ్ పనులతో రహదారి సగం మూసుకుపోవడంతో ఆటోలు, లారీలు, అంబులెన్స్ కూడా వెళ్లలేని పరిస్థితి ఏర్పడిందని అన్నారు. దీనిపై స్పందించిన రైల్వే అధికారి ఫెన్సింగ్ పనులు తాత్కాలికంగా నిలుపుదల చేసి సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బుగత వాసు, సంతోష్ పాల్గొన్నారు.



భూమిని చదును చేస్తున్న ప్రొక్లెయినర్

శాలిహుండం భూమి ఆక్రమణపై ఫిర్యాదు

ప్రజాశక్తి- పొందూరు

మండల కేంద్రంలోనీ సర్వేనెంబర్ 241లో ఉన్న శాలిహుండం ట్రస్టు భూమి ఆక్రమణపై ట్రస్టు చైర్మన్ మధురెడ్డి రెవెన్యూ, పోలీసులకు ఫిర్యాదు చేశారు. రాపాక-పొందూరు రోడ్డుకు ఆనుకుని శాలిహుండం ట్రస్టుకు 241 సర్వే నంబరులో అత్యంత విలువైన 89 సెంట్ల స్థలం ఉంది. ప్రస్తుతం ఈ ప్రాంతంలో సెంటు సుమారు రూ.15 నుంచి 20 లక్షలు వరకు పలుకుతోంది. ఎటువంటి లీజు లేకుండా సుమారు 50 సెంట్ల భూమిని పొందూరు పట్టణానికి చెందిన వ్యక్తి జెసిబితో చదును చేశారు. దీనిపై మధురెడ్డి అనధికారికంగా తమ భూమిని చదును చేస్తున్న వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని పొందూరు ఎస్ఐకు ఫిర్యాదు చేశారు.

25లోగా పంట నమోదు

మెళియాపుట్టి : ఈ ఏడాది ఖరీఫ్‌లో రైతులు పండించే ప్రతి పంటనూ గ్రామ వ్యవసాయ సహాయకులు వద్ద పంట నమోదు విధిగా చేసుకోవాలని ఎఒ ఎస్.దానకర్ణుడు ఒక ప్రకటనలో తెలిపారు. పంట నమోదు చేసుకున్న రైతులకు మాత్రమే ప్రభుత్వం నుంచి వచ్చే పథకాలు అందుతాయని అన్నారు. ముఖ్యంగా ధాన్యం కొనుగోలు, అన్నదాత సుఖీభవ, పంటల బీమా, ప్రకృతి వైపరీత్యాల వల్ల కలిగే పంట నష్టపరిహారం అందుతాయని అన్నారు. ప్రతి రైతూ తప్పనిసరిగా పంట నమోదు చేసుకోవాలన్నారు.

అన్నాజీరావుకు పరామర్శ

ప్రజాశక్తి- ఆమదాలవలస

మండలంలోని కొర్లకోటకు చెందిన మాజీ పిసిసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, కాంగ్రెస్ నాయకులు సనపల అన్నాజీరావు మాతృమూర్తి సనపల రత్నాలమ్మ ఇటీవల మృతి చెందారు. ఆమె మృతిపై పలువురు ప్రముఖులు సంతాపం వ్యక్తం చేశారు. సోమవారం మాజీ ఎమ్మెల్యే బొడ్డేపల్లి సత్యవతి, జిల్లా కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షులు కోత మధుసూదనరావు, పట్టణ సిటిజన్ ఫోరం అధ్యక్షులు జె.జె.మోహనరావు, న్యాయవాది బొడ్డేపల్లి మోహనరావు తదితరులు అన్నాజీరావు నివాసానికి వెళ్లి పరామర్శించి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. రత్నాలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు.

దాడి అన్యాయం

శ్రీకాకుళం సిటీ: భారత సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బిఆర్ గవాయ్‌పై దాడిని ఎంఆర్‌పిఎస్, ఎంఎస్‌పి, ఎంఇఎఫ్, విహెచ్‌పిఎస్ అనుబంధ సంస్థలు తీవ్రంగా ఖండించాయి. జిల్లా పరిషత్ కార్యాలయం ముందు సోమవారం నిరసన వ్యక్తం చేశారు. సుప్రీంకోర్టు జడ్జ్‌పై దాడి భారత రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా తెలిపారు. జడ్జ్‌పై దాడి చేసిన వారిని తక్షణం శిక్షించాలన్నారు. దాడివెనుక ఉన్న కుట్రను చేదించాలని, అసలు నింధితులను పట్టుకొని శిక్షించాలని కోరారు. శిక్షించే వరకు ఉద్యమం కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఎంఆర్‌పిఎస్ జిల్లా అధ్యక్షులు రామారావు, అనుబంధ సంస్థల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను సేకరించాలి

సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న సత్యనారాయణ

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల మార్కెటింగ్ భవిష్యత్‌లో పెరగాలని జిల్లా ప్రాజెక్టు మేనేజర్ పూజారి సత్యనారాయణ అన్నారు. జిల్లా వ్యవసాయశాఖ కార్యాలయంలో సోమవారం ప్రకృతి వ్యవసాయ పద్దతులపై సిబ్బందితో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ప్రకృతి వ్యవసాయం విస్తరణ లక్ష్యాన్ని వివరించారు. అన్ని రకాల పంటలు ఈ పద్దతుల్లో పండించటం, ప్రత్యేకంగా ఈ పంటల ఉత్పత్తులు సేకరించటం, ప్రత్యేక మార్కటింగ్ కల్పించటం లక్ష్యంగా వివరించారు. జిల్లాలో భవిష్యత్‌లో లక్ష ఎకరాల సాగు లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ రీజనల్ అధికారి హేమసుందర్, ఎడిషనల్ డిపిఎం ధనుంజయ్, మాస్టర్ ట్రైనర్లు పాల్గొన్నారు.

పారదర్శకంగా పుస్తకాల పంపిణీ

ప్రజాశక్తి- కవిటి

మండల పరిధిలో రెండో విడత పాఠ్య పుస్తకాల పంపిణీ గందరగోళం లేకుండా, పాఠశాల విద్యార్థుల నమోదుకు అనుగుణంగా ప్రతి విద్యార్థికీ అందేలా చర్యలు తీసుకోవాలని ఎపిటిఎఫ్ 1938 శాఖ సభ్యులు కోరారు. ఈ మేరకు మండల విద్యాశాఖాధికారి ధనంజయ మజ్జికి సోమవారం వినతిపత్రం అందించారు. అనంతరం సభ్యులు మాట్లాడుతూ పుస్తకాల పంపిణీ ప్రక్రియ పారదర్శకంగా ఉండాలని, పుస్తకాల కొరతలు లేకుండా ముందస్తు ఏర్పాట్లు చేయాలని సంఘ ప్రతినిధులు కోరారు. కార్యక్రమంలో మండల ఎపిటిఎఫ్ 1938 అధ్యక్షులు బల్ల ధర్మారావు, జిల్లా కార్యదర్శి శమల్ల రాజబాబు, రాష్ట్ర ఆడిట్ సభ్యులు మొర్రి గోపి,

వినతిపత్రం అందిస్తున్న సభ్యులు

కార్యవర్గ సభ్యులు శ్రీరామ్మూర్తి బిసాయి, భార్గవ్, శరత్ పాల్గొన్నారు.

ఎఫ్ఎ-2 పరీక్ష పరిశీలన

నరసన్నపేట: ప్రభత్వ, ప్రయివేటు పాఠశాలల్లో నిర్వహిస్తున్న ఎఫ్ఎ-2 పరీక్షల నిర్వాహణపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఎంఇఒ శాంతారావు సూచించారు. మండలంలోని మడపాం, నరసన్నపేట బోర్డు, నారాయణ స్కూళ్లల్లో నిర్వహిస్తున్న పరీక్షలను పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థుల హాజరు నిర్వహణ, తదితర అంశాలను పరిశీలించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

అధికారులతో మాట్లాడుతున్న ఢిల్లీరావు

వంతెన పనులు పరిశీలన

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

మండలంలోని తీర గ్రామాలైన బూర్జపాడు, డొంకూరు వద్ద రెండు వంతెలను నిర్మిస్తున్నారు. ఈ వంతెన పనులను మాజీ ఎంపిపి దక్కత ఢిల్లీరావు సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పనులు వేగవంతమయ్యేలా చర్యలు తీసుకోవాలని ఇంజినీర్ అధికారులకు సూచించారు. కార్యక్రమంలో డి.లోకేష్, కె.నరేంద్రరెడ్డి, సూర్య నారాయణ, దున్న కూర్మారావు, శివంగి గణపతి, పులకల శ్రీనివాస్, సిహెచ్.గురుమూర్తి, రామారావు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మించాలని వినతి

ప్రజాశక్తి- టెక్కలి

మండలంలోని వడ్డితాండ్ర-రావివలస మధ్యలో ఉన్న ఆర్అండ్‌బి రోడ్డు మరమ్మతులు చేపట్టకుంటే ఆందోళన బాట పడతామని రోడ్ల సాధన కమిటీ కన్వీనర్ కోత మధుసూదనరావు అన్నారు. ఈ మేరకు టెక్కలి ఆర్‌డిఒ ఎం.కృష్ణమూర్తిని సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బ్రిటిష్ కాలం నాటి రోడ్డు ఇదని, దశాబ్దాలు గడుస్తున్నా రోడ్డు నిర్మాణం లేదని అన్నారు. దీనివల్ల ప్రతి చిన్న విషయానికీ టెక్కలి వచ్చే గ్రామస్తులకు ఈ రోడ్డుతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని అన్నారు. తక్షణమే రోడ్డును నిర్మించాలని కోరారు. ఈయనతో పాటు సాధన కమిటీ నాయకులు బి.వి.రెడ్డిబాబు, కోత చిన్నబాబు, అప్పన్న, మల్లిఖార్జునరావు, ఆటో యూనియన్ నాయకులు జి.చిరంజీవి, సాయికుమార్ తదితరులు ఉన్నారు.

ఆర్‌డిఒకు వినతిపత్రం అందిస్తున్న మధుసూదనరావు

బాలియాత్రకు ఎమ్మెల్యేకు ఆహ్వానం

ప్రజాశక్తి- నరసన్నపేట

శ్రీముఖలింగలో బాలియాత్రకు రావాలని కమిటీ సభ్యులు కోరారు. ఈ మేరకు ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తిని సోమవారం కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. నవంబరు 9న నిర్వహించనున్న బాలియాత్రలో పాల్గొని విజయవంతం చేయాలని ఆహ్వానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కలింగ సామ్రాజ్య పూర్వ అచారమైన బాలియాత్రని విశేషంగా నిర్వహించడానికి పూర్తి సహాయ సహకారాలు అందించాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ టి.సతీష్‌కూమార్, ఎంపిటిసి కరుకోల హరిప్రసాద్, మార్కెట్ కమిటీ చైర్మన్ టి.బలరాం, కమిటీ సభ్యులు రమణమూర్తి. గుంట సింహాచలం, శ్రీనివాసరావు, జనార్థన్, అర్చక సంఘం అధ్యక్షులు శేషాద్రి వెంకటాచలం, అర్చకులు కొండయ్యశాస్త్రి, ధనుంజయ తదితరులు పాల్గొన్నారు.